నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 1 జూలై 2024 | BHADRADRI KOTHAGUDEM

ఖమ్మం: వర్షంలో తడుస్తూ వెళ్తున్న మహిళలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షం
- దుమ్ముగూడెంలో 39 మి.మీ, ఖమ్మంలో 32 మి.మీ వర్షపాతం
- పంట చేలలో ప్రాణం పోసుకుంటున్న పత్తి, పునాస పంటలు
- భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

ధారతెగని వాన

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ఖమ్మం వ్యవసాయం, జూన్ 30: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శనివారం ప్రారంభమైన వాన ఆదివారం రాత్రి దాటినా ధార తెగకుండా కురుస్తూనే ఉంది. కొన్ని మండలాల్లో తేలికపాటి, మరికొన్ని మండలాల్లో మోస్తరు, ఇంకొన్ని జిల్లాలో భారీ వర్షాలు కురిసింది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సగటున 32 మిల్లీ మీటర్ల వర్షపాతం, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో 39 డిగ్రీల వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో పత్తి, పునాస పంటలు ప్రాణం పోసుకుంటున్నాయి. విరామం లేకుండా కురిసిన వానతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల, పట్టణ, జిల్లా కేంద్రాల్లో జనజీవనానికి కాస్త ఆటంకం ఏర్పడింది. ఆయా పనుల మీద బయటకు వెళ్లాల్సిన వారు కాస్త ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా, మరో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

ములకలపల్లి: వాగు పొంగడంతో రాకపోకలను నిలిపివేసి పహారాగా ఉన్న అధికారులు

ఖమ్మం జిల్లాలో 32 మి.మీ. వర్షపాతం..

ఖమ్మం జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన సరాసరి వర్షపాతం 32 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఇందులో అత్యధికంగా తిరుమలయపాలెంలో 72.2 మిల్లీమీటర్లుగా ఉంది. ఆ తరువాత కూసుమంచిలో 43.8, ఖమ్మం రూరల్లో 46.2, ఖమ్మం అర్బన్‌లో 36.6, చింతకానిలో 35.6, నేలకొండపల్లిలో 39.8, రఘునాథపాలెంలో 34.8, కొణిజర్లలో 30, బోనకల్లులో 39.2, వైరాలో 34.4, వేంసూరులో 51.8, ఎర్రుపాలెంలో 32 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

పత్తి, పునాస పంటలకు ప్రాణం..

ప్రస్తుత వానముసురు వల్ల వానకాలం సీజన్‌లో సాగు చేసిన పత్తి, పునాస పంటలు ప్రాణం పోసుకుంటున్నాయి. ఇటీవలి వరకూ సరైన మోతాదులో వర్షాలు కురవకపోవడం వల్ల భూమిలో తేమ, నిమ్ముశాతం తగ్గిపోయాయి. పంటల కాపాడుకునేందుకు అన్నదాతలు నిన్నా మొన్నటి అనేకపాట్లు పడ్డారు. తాజాగా కురుస్తున్న వర్షాల వల్ల పంటలు జీవం పోసుకుంటున్నాయి. ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది దాదాపు 5,96,662 ఎకరాల్లో వివిధ పంటలు సాగు కావొచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకూ 1,82 723 ఎకరాల్లో పంటలు మొలకెత్తాయని, అందులో అత్యధికంగా 1,35 658 ఎకరాల్లో పత్తి, 13,713 ఎకరాల్లో వరి, 7,611 ఎకరాల్లో పెసర, 752 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగవుతున్నాయి. 25 వేల ఎకరాల్లో రైతులు పచ్చిరొట్ట విత్తనాలను చల్లారు.

భద్రాద్రిలో వాగులకు వరద తాకిడి..

భద్రాద్రి జిల్లాలో కూడా వర్షం కురుస్తూనే ఉంది. అశ్వాపురం, పాల్వంచ, గుండాల, దుమ్ముగూడెం, ఆళ్లపల్లి మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. మొర్రేడు, తాలిపేరు, పెదవాగు, సింగభూపాలెం, కిన్నెరసాని, చెరువులు, డ్యాములు, వాగులకు వరద తాకిడి పెరుగుతోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

వైరాలో కూలిన భారీ వృక్షం..

వైరా రూరల్, జూన్ 30: వర్షం కారణంగా వైరా మండలం రెబ్బవరం గ్రామంలో ఆదివారం ఉదయం భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలింది. దీంతో వైరా – జగ్గయ్యపేట మార్గంలో కిలోమీటర్ల వందలాది వాహనాలు నిలిచిపోయాయి.

సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

రామవరం, జూన్ 30: శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం కారణంగా సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లి జేవీఆర్, కిష్టారం ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. 38 వేల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాల్సి ఉండగా వర్షం కారణంగా ఉత్పత్తి పూర్తిగా నిలిచిందిపోయింది. 16 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఖమ్మం నగరంలో తడుస్తూనే స్కూటీపై వెళ్తున్న కుటుంబీకులు

ఖమ్మంలో గొడుగులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

వైరా రూరల్: రోడ్డుపై విరిగిపడ్డ భారీ వృక్షం

పిడుగుపాటుతోనే అగ్నిప్రమాదం

- యూనిట్-1 వద్ద రూ.25 కోట్ల వరకు నష్టం
- ధ్రువీకరించిన బీటీపీఎస్ డైరెక్టర్ లక్ష్యయ్య

పిడుగుపాటుకు గురై కాలిపోయిన బీటీపీఎస్ యూనిట్-1 జీటీ

మణుగూరు టౌన్, జూన్ 30:భద్రాద్రి జిల్లా మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (బీటీపీఎస్)లో యూనిట్ -1 వద్ద శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం పిడుగుపాటు వల్లనే సంభవించిందని అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో విద్యుత్ థర్మల్ డైరెక్టర్ లక్ష్యయ్య, విద్యుత్ సౌధా ఎస్ఈ రత్నాకర్‌లు ఆదివారం బీటీపీఎస్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం డైరెక్టర్ లక్ష్యయ్య విలేకరులతో మాట్లాడుతూ..పిడుగుపాటు ప్రభావం పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నప్పటికీ పిడుగు పడినట్లు సీసీ టీవీ ఫుటేజీల్లో గుర్తించామని అన్నారు. దీనివల్ల రూ.20 కోట్ల – రూ.25 కోట్ల వరకూ నష్టం జరిగి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామన్నారు. అగ్ని ప్రమాదం వల్ల యూనిట్–1లో విద్యుత్ ఉత్పత్తికి పూర్తిగా అంతరాయం ఏర్పడుతుందన్నారు. కాలిపోయిన జనరేటర్, యంత్ర సామగ్రి లభ్యత ఆధారంగా మాత్రమే ఈ యూనిట్ పునరుద్ధరణ అంశంలో స్పష్టత వస్తుందని తెలిపారు.

270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం..

బీటీపీఎస్ యూనిట్–1 జీటీ (జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్) వద్ద పిడుగుపడడంతో 270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడినట్లయింది. అయితే దీని పునరుద్ధరణకు 40 – 45 రోజుల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

కొట్టుకుపోయిన అప్రోచ్ నిర్మాణం

- ములకలపల్లిలో పొంగిన పాములేరు వాగు
- ఆరు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

అశ్వారావుపేట/ ములకలపల్లి, జూన్ 30: ములకలపల్లి మండలంలోని పాములేరు వాగు అప్రోచ్ నిర్మాణం కొట్టుకుపోయింది. దీంతో ఆరు గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు వాగు అప్రోచ్‌ను పరిశీలించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించారు. ములకలపల్లి మండలంలోని తాళ్లపాయి పంచాయతీ పరిధిలో రింగిరెడ్డిపల్లి మీదుగా భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిపై పాములేరు వాగు మీద వంతెన నిర్మాణానికి అధికారులు సిద్ధమయ్యారు. అప్పటికే ఉన్న బ్రిడ్జిని కాంట్రాక్టర్ తొలిగించి రాకపోకలకు అంతరాయం కలుగకుండా తాత్కాలికంగా అప్రోచ్ నిర్మించారు. ఈ క్రమంలో ఇటీవల ములకలపల్లి మండల వ్యాప్తంగా కురిసిన వర్షానికి అప్రోచ్ కొట్టుకుపోయింది. దీంతో రింగిరెడ్డిపల్లి, తాళ్లపాయి, మంగళిగుట్ట, సుందర్‌నగర్ తదితర గ్రామాలకు రవాణా వ్యవస్థ స్తంభించింది. మండల కేంద్రమైన ములకలపల్లితో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

పాములేరు వాగుపై వరదకు కొట్టుకుపోయిన అప్రోచ్ బ్రిడ్జి

సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ పుల్లారావు, సీఐ వినయ్‌కుమార్, ఎస్సై రాజమౌళి, గిర్దావర్ తారాచంద్‌లు ఆదివారం వంతెన వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

'పేట' ఎస్ఐ ఆత్మహత్యాయత్నం!

అశ్వారావుపేట, జూన్ 30: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పూర్తి వివరాల కోసం ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. అశ్వారావుపేటలో పోలీస్ సేషన్ పక్కనే ఉన్న క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ఎస్సై శ్రీను ఆదివారం ఉదయం 8:30 గంటలకు మఫ్టీలో స్టేషన్‌కు వచ్చారు. సోమవారం నుంచి వచ్చే కొత్త చట్టాలపై సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రైవేట్ కారు అక్కడకు వచ్చి ఆగింది. వెంటనే ఆ కారు వద్దకు వెళ్లిన ఎస్ఐ.. కారులోంచి డ్రైవర్‌ను కిందికి దింపాడు. 'ఇప్పుడే వస్తా' అంటూ సొంతంగా కారును డ్రైవ్ చేసుకుంటూ బయటకు వెళ్లిపోయారు. మధ్యాహ్నమైనా రాకపోయే సరికి సిబ్బంది ఫోన్ చేశారు. రెండుసార్లు ప్రయత్నించినా అతడి ఫోన్లు స్విచ్ఛాఫ్ రావడంతో వారు కంగారు పడ్డారు. వెంటనే సీఐ జితేందర్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. అతడు వెంటనే ఎస్ఐ ఫోన్ లోకేషన్‌ను ట్రాక్ చేయగా మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత మండలంలోని తిరుమలకుంట అటవీ ప్రాంతంలో స్విచ్ఛాఫ్ అయినట్లు గుర్తించారు. కానీ రాత్రి 10:45 గంటల వరకు అచూకీ లభ్యం కాకపోవడంతో విషయం తీవ్రమైంది. ఇంతలో మహబూబాబాద్‌లో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే అక్కడి ఎస్ఐ అరుణ స్పందించి చికిత్స కోసం అతడిని అక్కడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ శ్రీను ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. స్థానిక పోలీసులు మహబూబాబాద్ పయనమై వెళ్లారు. కాగా, శ్రీరాముల శ్రీను.. ఈ ఏడాది ఫిబ్రవరిలో మణుగూరు నుంచి అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. విధినిర్వహణలో అతడిపై పలు ఆరోపణలు వ్యక్తమయ్యాయి. జిల్లా ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై సీఐ జితేందర్‌రెడ్డిని 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. ఎస్ఐ శ్రీను మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తమకు సమాచారం అందిందని, తాము అక్కడికి వెళ్తున్నామని తెలిపారు. అయితే, ఎస్ఐ శ్రీను ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వెద్యులు తెలిపినట్లు మహబూబాబాద్ ఎస్ఐ అరుణ 'నమస్తే'కు వివరించారు.

అమెరికాలో కల్లూరు విద్యార్థి మృతి

ఈతకు వెళ్లి నీటమునిగి మృత్యువాత

మృతిచెందిన కిరణ్ (ఫైల్)

పెనుబల్లి, జూన్ 30: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన కిరణ్.. అమెరికాలో మృతిచెందాడు. నిరుడు నవంబర్‌లో అమెరికాకు వెళ్లిన అతడు.. అక్కడి మిస్సోరీ స్టేట్‌లో శ్యాండిల్ ఎస్ టౌన్‌లో ఉంటూ ఎంఎస్ చదువుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కిరణ్ తాను నివసిస్తున్న ప్రదేశానికి సమీపంలో ఈత కొట్టేందుకు ముగ్గురు మిత్రులతో కలిసి వెళ్లాడు. 8 అడుగుల లోతు ఉన్న ఆ ఈత కొలనులోకి అందరూ దిగారు. కానీ కిరణ్ పూర్తి లోతుకు వెళ్లిన కిరణ్.. ఈత రాకపోవడంతో నీళ్లలో మునిగిపోయాడు. మిగిలిన మిత్రులకు కూడా ఈత రాకపోవడంతో వారు కూడా మునుగుతున్న కిరణ్‌ను చూస్తూ నిస్సాహాయులుగా ఉన్నారు. కాగా, కిరణ్ తండ్రి లక్ష్మణరాజు గతంలో చనిపోగా తల్లి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటోంది. వీరి బాధ్యతలను కిరణ్ తాత కృష్ణమూర్తిరాజు చూస్తున్నారు. అయితే, అతడి మృతదేహం అమెరికా నుంచి స్వగ్రామమైన చిన్నకోరుకొండికి గురువారం వస్తుందని కుటుంబసభ్యులు తెలిపారు.

గనుల వేలంపై పోరుబాట

సింగరేణి బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియపై కార్మిక సంఘాలు పోరుబాట పట్టాయి. ప్రైవేట్‌కు కట్టబెడితే దాదాపు 40వేల మంది కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం పొంచి ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యుద్ధభేరి మోగిస్తున్నాయి. గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ, మరో జాతీయ కార్మిక సంఘమైన ఐఎన్‌టీయూసీ ఇప్పటివరకు తమ వైఖరిని తెలియజేయకపోగా, మిగతా సంఘాలు ఉద్యమానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే స్పష్టమైన కార్యచరణ ప్రకటించిన టీబీజీకేఎస్, బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతుతో నేటి నుంచే పోరాడనున్నాయి. సోమవారం నుంచి గనులపై దశలవారీగా నిరసనలు తెలుపుతామని, 9న ఖనిలో మహాధర్నాకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటున్నారని యూనియన్ పేర్కొంది. – గోదావరిఖని, జూన్ 30

సింగరేణి ఉపరితల బొగ్గు గనులు (ఫైల్)

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణిపై అనేక కుట్రలు చేస్తున్నది. బొగ్గుబ్లాకులను వేలం వేసి ప్రైవేట్‌కు కట్టబెట్టే ప్రక్రియకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో సింగరేణి కార్మిక సంఘాలు కన్నెర్ర జేస్తున్నాయి. ఒక్కసారిగా పోరుబాటలోకి వెళ్లిపోయాయి. బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే దాదాపు 40వేల మంది కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం పొంచి ఉండగా, మెజారిటీ కార్మిక సంఘాలు ఆందోళనలకు సిద్ధమయ్యాయి. గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్న ఏఐటీయూసీ ఇప్పటివరకు స్పష్టమైన ప్రణాళిక లేకుండా, తమ వైఖరిని తెలియజేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. మరో జాతీయ కార్మిక సంఘం కాంగ్రెస్‌కు అనుబంధమైన ఐఎన్‌టీయూసీ సైతం వేలానికి వ్యతిరేకమని చెబుతున్నప్పటికీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం, ఆ పార్టీ వైఖరి ఎలా ఉంటుందో తెలియకపోవడంతో ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నది. ఇదిలా ఉంటే రెండ్రోజుల కింద శ్రీరాంపూర్‌లో హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్‌తోపాటు ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ ఇతర సంఘాల ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించి బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని తీవ్రంగా నిరసిస్తున్నట్లు ప్రకటించారు. వచ్చేనెల 3న హైదరాబాద్ సోమాజిగూడలో ప్రెస్‌క్లబ్‌లో కార్మిక సంఘాల నాయకులు, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యచరణ నిర్ణయిస్తామని రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు.

స్పష్టమైన వైఖరితోనే బీఆర్ఎస్, టీబీజీకేఎస్

సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు తాము ఎప్పుడూ ముందుంటామని బీఆర్ఎస్ పేర్కొంటున్నది. అధికారంలో ఉన్న పదేండ్లలో సింగరేణి కార్మికుల అనేక హక్కులు కల్పించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కింది. ఆంధ్రా వలసవాదుల కుట్రలో తీవ్రంగా నలిగిపోయిన సంస్థను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లి కోల్ ఇండియాలో లేని అనేక హక్కులు కల్పించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కింది. బీఆర్ఎస్ హయాంలో ప్రగతి బాటలో పయనించిన సింగరేణి సంస్థకు సంబంధించిన బొగ్గు బ్లాక్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేలం వేయాలనే కుట్రలను సహించేది లేదని తేల్చి చెప్పుతూ ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతున్నది. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ అనుబంధ సంఘం, సింగరేణి సంస్థలో దశాబ్ద కాలానికిపైగా గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ కార్మికుల రక్షణే ధ్యేయంగా ముందు సాగుతామని పేర్కొంటున్నది. ఈ క్రమంలో బొగ్గు బ్లాక్‌లకు వ్యతిరేకంగా కలిసి వచ్చే కార్మిక సంఘాలతో ముందుకు సాగుతామని ప్రకటించింది.

నేటి నుంచే పోరుబాట

సింగరేణిని కాపాడుకునేందుకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పోరాటానికి సిద్ధమైంది. సోమవారం నుంచి సింగరేణి వ్యాప్తంగా దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి స్పష్టం చేశారు. 1న గనులపై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయడంతోపాటు గని అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని, 3న అన్ని ఏరియాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం, 6న సింగరేణిలోని అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, జీఎంలకు వినతిపత్రాలు అందజేత, 9న గోదావరిఖని పట్టణంలో మహాధర్నా ఉంటుందని, దీనికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, సింగరేణి కార్మికులు పెద్దసంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని మిర్యాల రాజిరెడ్డి తెలిపారు.

సింగరేణి సీఎండీకి ట్రీమ్యాన్ ఆఫ్ తెలంగాణ అవార్డు

- స్వయంగా 18 వేల మొక్కలు నాటినందుకు గుర్తింపు

అవార్డు అందుకుంటున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, జూన్ 30: సింగరేణి సంస్థను పర్యావరణ హిత సంస్థగా మార్చడమే కాకుండా అందరిలోనూ పర్యావరణ స్ఫూర్తిని పెంచేందుకు తానే స్వయంగా 18 వేలకు పైగా మొక్కలు నాటి, తెలంగాణలోని ఆరు జిల్లాలో 35 చిన్న అడవులను సృష్టించినందుకు గుర్తింపుగా సింగరేణి సీఎండీ బలరాంకు గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రీ మ్యాన్ ఆఫ్ తెలంగాణ అనే ప్రతిష్టాత్మక అవార్డును ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ 2024 అవార్డుల ప్రదానోత్సవంలో ఆ సంస్థ ఎండీ అశుతోశ్ వర్మ, ఎన్‌టీపీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉన్నతాధికారులు సింగరేణి సీఎండీకి ఈ అవార్డును అందజేశారు. దేశంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రభుత్వ రంగ, ప్రైవేట్ రంగ దిగ్గజ కంపెనీలు, అందులోని ప్రభావశీల వ్యక్తులకు ఏటా ఇటువంటి ప్రోత్సాహక అవార్డులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సింగరేణి సీఎండీ ఇప్పటికే స్వయంగా 18 వేలకు పైగా మొక్కలు నాటారని, సంస్థ కూడా ఆరు కోట్లకు పైగా మొక్కలు నాటి పర్యావరణానికి మేలు చేస్తున్న సంస్థల్లో అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ అధికారిగా ఉన్నతస్థాయిలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ పర్యావరణ పరిరక్షణ కోసం ఒక్కరే 18 వేల మొక్కలు నాటి ఆరు జిల్లాల్లో 35 చిన్న అడవులుగా సృష్టించడం దేశంలోనే అత్యంత అరుదైన విషయమని కొనియాడారు. అనంతరం సీఎండీ బలరాం మాట్లాడుతూ.. మొక్కలు నాటడమంటే చిన్నప్పటి నుంచే తనకు ఎంతో ఇష్టమని, పర్యావరణ ఫరిరక్షణకు తనవంతుగా మొక్కలు నాటుతున్నానని అన్నారు. 'ప్రతీ అడుగు పచ్చదదనం' అనే నినాదంతో సింగరేణిలో మొక్కలు నాటే యజ్ఞాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. సింగరేణి వ్యాప్తంగా ఎక్కడ ఖాళీ స్థలం ఉన్నా మొక్కలు నాటుతామని అన్నారు.